**తెలంగాణ ఆవిర్భావ చక్రం**

| | | | |
|---|---|---|---|
| | శు కే | ర | బు గు |
| లగ్నం | 2-6-2014 00.00.01 హైదరాబాద్ | | చ |
| | | | |
| | | శ రా | కు |

**వర్ష లగ్నం (వర్షారంభం)**

| | | | |
|---|---|---|---|
| చ బు ర గు | రా శు | | కు |
| శ | 21-4-2023 రా.10.54 గం.లకు | | |
| | | | |
| | లగ్నం | కే | |

**జగల్లగ్నం (మేష సంక్రమణం)**

| | | | |
|---|---|---|---|
| గు | ర బు రా | శు | కు |
| శ | 14-4-2023 ప.2.58 గం.లకు | | |
| చ | | | లగ్నం |
| | | కే | |

# తెలంగాణ ఆవిర్భావ చక్రం

**తెలంగాణ గురు మహాదశలో ఆవిర్భవించింది. గురుడి స్వనక్షత్రమైన పునర్వసు 4వ పాదం, కర్కాటక రాశిలో రాష్ట్రం ఏర్పాటు జరిగింది. లగ్నాధిపతి భాగ్యంలో, ధనాధిపతి పంచమ కోణంలో, సప్తమాధిపతి చతుర్థంలో ఉండటం విశేషంగా చెప్పవచ్చు. ఈ సంవత్సరం గోచార రీత్యా గురువు భాగ్య, రాజ్య స్థానాల్లో సంచరించడం వల్ల పాలకులు రాష్ట్రాభివృద్ధి ధ్యేయంగా పనులు చేపడతారు. అయితే శని ప్రభావం కారణంగా ఆర్థిక ఇబ్బందులు తలెత్తవచ్చు. సామాన్య ప్రజలకు ఉపయుక్తమైన సంక్షేమ పథకాలు కొనసాగుతాయి. పాలకులు.. కర్షకులకు, కార్మికులకు అనుకూలమైన నిర్ణయాలు తీసుకుంటారు. పారిశ్రామిక రంగంలో విప్లవాత్మకమైన మార్పులు చోటుచేసుకుంటాయి. సంక్షేమం, అభివృద్ధి రెండూ సమర్థంగా ముందుకుసాగుతాయి.**

## వర్షలగ్నం (సంవత్సర ఆరంభం)

శ్రీ శోభకృత్ నామ సంవత్సర చైత్ర శుక్ల పాడ్యమి మంగళవారం తేది 21-3-2023 రాత్రి 10-54 గంటలకు వృశ్చికలగ్నంలో ప్రవేశించింది. లగ్న, షష్ఠమాధిపతి కుజుడు అష్టమంలో ఉండటంతో ఆకస్మిక ఘటనలు చోటుచేసుకుంటాయి. అధికారులు, పాలకులు ప్రజారోగ్యంపై మనసు నిలుపుతారు. ద్వితీయ పంచమాధిపతి గురువు స్వక్షేత్రంలో ఉండటం వల్ల రాష్ట్రానికి ఆదాయం పెరుగుతుంది. వాణిజ్యరంగం పుంజుకుంటుంది. సరుకుల ఎగుమతి, దిగుమతుల వల్ల ఆదాయం పెరుగుతుంది. పాఠశాలలు, కళాశాలలు, విశ్వవిద్యాలయాల అభివృద్ధి వేగంగా జరుగుతుంది. విద్య, ఆరోగ్యం, మౌలిక వసతుల కోసం ప్రభుత్వాలు భారీగా నిధులు వెచ్చిస్తాయి. రాష్ట్రం, దేశం అభివృద్ధి పథంలో పయనిస్తాయి. తృతీయ, చతుర్థాధి శని నాలుగింట స్వక్షేత్రంలో ఉండటం వల్ల ప్రజల జీవనశైలిలో అనుకూలమైన మార్పులు కలుగుతాయి. ప్రజల మధ్య ప్రేమాభిమానాలు నెలకొంటాయి. సప్తమ, వ్యయాధిపతి శుక్రుడు అష్టమంలో, రాజ్యాధిపతి రవి, అష్టమ, లాభాధిపతి బుధుడు ఐదింట ఉండటం వల్ల దేశంలోని పశ్చిమ ప్రాంతంలో వర్షాభావ పరిస్థితులు తలెత్తవచ్చు. ఉత్తర ప్రాంతంలో సంతృప్తికర వాతావరణం ఉంటుంది. తూర్పు ప్రాంతంలో మొదటి మూడు నెలలు ప్రతికూల పరిస్థితులు ఏర్పడతాయి. శాంతిభద్రతల సమస్యలు తలెత్తుతాయి. దక్షిణ భారతంలో మొదటి ఐదు నెలలు ప్రతికూలంగా ఉన్నప్పటికీ తర్వాత రాజకీయ వాతావరణం పుంజుకుంటుంది. ఆర్థికంగా దక్షిణాది రాష్ట్రాలు బలం పుంజుకుంటాయి.

## జగల్లగ్నం (మేష సంక్రమణం)

శ్రీ శోభకృత్ నామ సంవత్సర చైత్ర కృష్ణ నవమి శుక్రవారం తేది 14-4-2023 సింహలగ్న సమయంలో రవి మేషరాశిలోకి ప్రవేశిస్తున్నాడు. లగ్నాధిపతి భాగ్యస్థానంలో ఉచ్ఛంగతుడై ఉండటం శుభప్రదం. ప్రభుత్వం సుస్థిరంగా ఉండి, ప్రజా సంక్షేమంపై దృష్టిసారిస్తుంది. ధన, లాభాధిపతి భాగ్యస్థితిని పొందడంతో రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దినదినాభివృద్ధి చెందుతుంది. వాణిజ్యరంగం పురోగతి సాధిస్తుంది. తృతీయ, రాజ్యాధిపతి దశమ కేంద్రంలో విశేష ఫలితాలు ఇస్తాడు. కళలకు ఆదరణ లభిస్తుంది. కార్పొరేట్ రంగం అభివృద్ధి చెందుతుంది. చతుర్థ, భాగ్యాధిపతి లాభంలో ఉండటం వల్ల సస్యానుకూల వర్షాలు పడతాయి. ప్రజల్లో సుఖశాంతులు వెల్లివిరుస్తాయి. పంచమ, అష్టమాధిపతి స్వక్షేత్రంలో ఉన్నప్పటికీ, అష్టమంలో ఉండటం వల్ల మిశ్రమ ఫలితాలు ఇస్తాడు.

## దేశారిష్ట యోగాలు

ఈ సంవత్సరం తేది 7-6-2023 నుంచి 20-2-2024 వరకు శని, గురువు ఏకాదశ త్రిక (11-3) రాశుల్లో సంచరిస్తున్నారు. దీనివల్ల దేశం మధ్య ప్రాంతం నుంచి శ్రీలంక వరకు ఉన్న ప్రదేశాల్లో వాహన, అగ్ని ప్రమాదాలు జరగవచ్చు. 22-4-2023 నుంచి 30-10-2023 వరకు గురువు, రాహువు కలిసి ఉండటం వల్ల గురుచండాల యోగం ఏర్పడింది. దీనివల్ల పలువురు ప్రముఖులకు అరిష్టం గోచరిస్తున్నది. 22-4-2023 నుంచి 15-5-2023 వరకు మేషరాశిలో చతుఃగ్రహ కూటమి ఏర్పడుతుంది. దీంతో ఇరుగుపొరుగు దేశాలతో సరిహద్దు వివాదాలు ముదిరే అవకాశాలు ఉన్నాయి. 3-10-2023 నుంచి 30-10-2023 వరకు కుజుడు, రాహువు సమసప్తక స్థితిలో ఉండటం వల్ల దేశంలో అంతఃకలహాలు ఏర్పడవచ్చు. పంటలకు నష్టం వాటిల్లవచ్చు. 30-11-2023 నుంచి 24-12-2023 వరకు గురువు, శుక్రుడు సమసప్తక స్థితిలో ఉండటం వల్ల ఇరుగుపొరుగు దేశాలతో సంబంధాలు దెబ్బతినవచ్చు.